అందుబాటులో ఆధార్ సేవలు



51వ వార్డు అంబేద్కర్ కాలనీ సచివాలయంలో ఆధార్ సేవలందిస్తున్న సిబ్బంది



43వ వార్డు న్యూ వేంకటేశ్వర కాలనీ సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

- విద్యార్థుల బయోమెట్రిక్ వివరాల అప్‌డేషన్‌కు అవకాశం
- 24 వరకు ప్రత్యేక శిబిరాలు

సీతంపేట: కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19, 20, 21, 23, 24 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు జరుగుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను పొందడానికి వేలి ముద్రలు పడటానికి వీలుగా ప్రతి పదేళ్లకు ఒకసారి ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. ఈ ఆధార్ క్యాంపుల్లో ఉచితంగా విద్యార్థుల వేలిముద్రల నమోదు(మేండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్), కొత్తగా ఆధార్ నమోదు(న్యూ ఆధార్ కార్డు ఎన్‌రోల్‌మెంట్), ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం(డెమోగ్రాఫిక్ కరెక్షన్స్) ఆన్‌లైన్ డాక్యుమెంట్ అప్‌డేట్ కోసం, ఆధార్ కార్డు ప్రింట్ కోసం, బయోమెట్రిక్ మార్పులు, అప్‌డేషన్ సేవలు అందిస్తున్నారు. ఆధార్ నిబంధనల ప్రకారం 5 నుంచి 15 ఏళ్ల పిల్లల ఆధార్ బయోమెట్రిక్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది. ఆయా సచివాలయాల పరిధిలో పాఠశాలల విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను ప్రత్యేక క్యాంపుల ద్వారా అప్‌డేట్ చేయనున్నారు, వలంటీర్లు తమ పరిధిలోని విద్యార్థులను గుర్తించి వారి వివరాలను సచివాలయ సిబ్బందికి అందజేయాలి.

43వ వార్డులో..

జీవీఎంసీ 43వ వార్డు న్యూ వెంకటేశ్వర కాలనీ సచివాలయం(1056245)లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వార్డు ఎడ్యుకేషన అండ్ డేటా ప్రాసెస్ సెక్రటరీ మోహన్ సేవలందిస్తున్నారు. సచివాలయ పనివేళల్లో ఆధార్ సేవలు పొందవచ్చు. గురువారం వార్డులోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేయించుకున్నారు.

51వ వార్డులో..

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని పలు సచివాలయాల్లో ఆధార్ సేవలు గురువారం నుంచి అందుబాటులో ఉన్నాయి. 287 అంబేడ్కర్ కాలనీ, 290 గాంధీనగర్-3, 289 మాధవధార-2 సచివాలయాల్లో సేవలు పొందవచ్చు. ఎవరైనా ఆధార్ అప్డేట్ చేసుకోవాలంటే సమీపంలోని ఆయా సచివాలయాలకు వెళ్లవచ్చు. బయోమెట్రిక్ ద్వారా పేరు, పుట్టిన తేదీ, చిరునామా, ఫొటో, ఫోన్ నంబర్ తదితర ఆధార్ సేవల కోసం సచివాలయాన్ని సందర్శిస్తే పని అయిపోతుంది. ఈ ప్రత్యేక డ్రైవ్ 5 రోజుల పాటు కొనసాగుతుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు పొందవచ్చు.

జోన్-5లో ఆధార్ కేంద్రాలివే..



జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని పలు వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవా కేంద్రాలను గురువారం నుంచి ప్రారంభించారు. ఆధార్ కార్డులో తప్పులు, సవరణలు, కొత్తగా నమోదు వంటి ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ప్రత్యేక క్యాంపులు జరగనున్నాయి. ఉత్తర నియోజకవర్గంలోని ప్రతి వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆయా వార్డుల ప్రజలు సద్వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

వార్డు సచివాలయాల్లో సేవలు ప్రారంభం

సద్వినియోగించుకోండి



జీవీఎంసీ జోన్-5 పరిధిలో ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి ఆయా వార్డు సచివాలయాల్లో సుమారు 11 ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఆధార్ కార్డులో తప్పులు, సవరణలు, కొత్తగా నమోదు వంటివి చేస్తారు. ఐదు రోజుల పాటు కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. వీటి సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలి.

– ఆర్.జి.వి.కృష్ణ, జోన్-5 కమిషనర్, జీవీఎంసీ

ఆధార్ సేవలకు సంప్రదించండి

వార్డు సచివాలయం	కోడ్ నంబర్	ఇన్‌చార్జి	ఫోన్ నంబర్
న్యూ వేంకటేశ్వర కాలనీ	21086246	కె.మోహన్‌రావు	94936 32327
నరసింహనగర్	21086253	కె.కోటేశ్వరరావు	97033 30393
సంజీవ్ కాలనీ	21086260	ఎస్.శివరామకృష్ణ	96520 96465
అంబేద్కర్ కాలనీ	21086287	జి.ప్రభాకర్	94943 10435
మహతి కాలనీ	21086288	జి.రంజిత	84648 39310
మాధవధార	21086289	జి.వెంకటేష్	99667 14743
గాంధీ నగర్	21086290	ఎస్.నవ్యపల్లవి	78426 23525
యూడీఏ కాలనీ	21086294	ఎస్.నరేంద్ర	81257 17262
భవానీ గార్డెన్	21086302	జి.భవాని	96663 67380
గణేష్ నగర్	21086303	ఎం.కుమారి	87906 98924
ఇండస్ట్రియల్ కాలనీ	21086340	ఉత్తమ్ చౌదరి	90523 36526

క్లుప్తంగా

పౌర గ్రంథాలయంలో వేమన జయంతి



ప్రజా కవి వేమనపై చర్చా వేదికలో పాల్గొన్న సాహితీవేత్తలు

సీతంపేట: ప్రజా కవి యోగి వేమన జయంతి సందర్భంగా విశాఖ పౌర గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో 'ప్రజా కవి వేమన'పై చర్చా వేదిక జరిగింది. రచయిత డి.వి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజల నుడికారంలో ప్రజా సమస్యలను సాంఘిక దృక్పథంతో వేమన వివరించారని పేర్కొన్నారు. కవులు, రచయితలు ఆచార్య తిమ్మారెడ్డి, ఆచార్య వెలమల సిమ్మన్న, డి.పద్మజ, ఎం.సుబ్బారావు, ఎస్.ప్రభాకరరావు, పరవస్తు సూరి, బి.వెంకటరావు, గుండాన జోగారావు తదితరులు భిన్న కోణాల్లో వేమన తత్వాన్ని ఆవిష్కరించారు.

కొండవాలు ప్రాంతాల్లో ఫాగింగ్



వరాహగిరి కాలనీ-2లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని కొండవాలు ప్రాంతాల్లో గురువారం దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఫాగింగ్ చేపట్టారు. వరాహగిరి కాలనీ-2లోని పలు వీధుల్లో జీవీఎంసీ సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. వాతావరణ మార్పుల వల్ల దోమల నిర్మూలనకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు. స్థానిక వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

వ్యక్తి ఆత్మహత్య



ఉరి వేసుకుని మృతి చెందిన పాండురంగారావు

సీతమ్మధార: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. లలితా నగర్‌లో లలితాదేవి ఆలయం దరి క్వార్టర్స్‌లోని ఇంట్లో కుటుంబంతో కలిసి అప్పల దీక్షిత పాండురంగారావు(39) నివసిస్తున్నాడు. అతడికి వివాహం కాలేదు. మద్యానికి బానిసైన అతడు డబ్బులు ఇవ్వమని తరచూ ఇంట్లో వారిని అడిగే వాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. అతడి అన్నయ్య వేణుగోపాల్ ఇంటికి వచ్చి చూసే సరికి ఫ్యాన్‌కు వేలాడుతూ విగత జీవిగా కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూ టీడీఆర్ హబ్ పోర్టల్ ప్రారంభం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లేనరీ హబ్ పోర్టల్(టీడీఆర్)ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ప్రారంభించారు. వీసీ కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ టీడీఆర్ డీన్ జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రవేశాలు పొందిన పరిశోధకులు, రీసెర్చ్ గైడ్‌లు శనివారంలోగా తమ వివరాలు సమగ్రంగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోర్టల్ ద్వారా రీసెర్చ్ గైడ్‌తో పరిశోధకులు ఎక్కడనుంచైనా తమ పరిశోధనకు సంబంధించిన ప్రగతిని చర్చించడం, వివరించడం సాధ్యపడుతుంది. దశలవారీగా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ సేవలు అందించే వేదికగా ఈ పోర్టల్‌ను తీర్చిదిద్దుతామన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఉన్నతాధికారుల పర్యటన



గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, జెడ్సీ కృష్ణ తదితరులు

తాటిచెట్లపాలెం: జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు గల గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో గురువారం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి పర్యటించారు. మార్చిలో జరగనున్న జీ-20 సదస్సు కోసం నగరాన్ని సుందరీకరణ చేసే దిశగా ఈ ప్రాంతంలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదర్, డీసీపీ, సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ వేణుగోపాల్, అసిస్టెంట్ ఇంజినీర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాల తరలింపు



టోయింగ్ వాహనం ద్వారా కారును తరలింపజేస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మద్రిపాలెం: రహదారులపై ప్రమాదాల నియంత్రణలో భాగంగా గురువారం కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బీఆర్‌టీఎస్ సర్వీసు రోడ్డుకు ఇరువైపులా ఎప్పటి నుంచో రాంగ్ పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తునటువంటి వాహనాలను టోయింగ్ వాహనం ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు మాట్లాడుతూ కొంతకాలంగా రోడ్డుకు ఇరువైపులా పార్క్‌చేసి వదిలేస్తున్న వాహనాలను తొలగించి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. కంచరపాలెం మెట్టు నుంచి 104 ఇండస్ట్రియల్ ఎస్టేట్ వరకు ఈ డ్రైవ్ నిర్వహించామన్నారు. 35 వాహనాలను తరలించి, రూ.9,600 జరిమానా విధించామని ఆయన చెప్పారు.

ప్రజలపై విద్యుత్ భారం తగదు



ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నేతలు

సీతమ్మధార: రాష్ట్రంలోని కోటి 89 లక్షల మంది వినియోగదారులకు, నివాస, గృహాలు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలన్నింటికీ 2025 మార్చిలోపు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టాలనే ప్రతిపాదనను సీపీఐ, సీపీఎంలు వ్యతిరేకించాయి. ఈ మేరకు గురువారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద వామపక్షాల నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులపై తీవ్రమైన భారాన్ని కేంద్రం ప్రభుత్వం మోపుతోందన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలపై భారాలు వేసే విధంగా నిర్ణయాలు ఉండటాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపామని చెప్పారు. ఆదానీ లాంటి కార్పొరేట్ సంస్థల లాభాల కోసం విద్యుత్ సంస్కరణల అమలును తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు వేస్తే మరో విద్యుత్ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఏపీఈఆర్‌సీ చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణకు సీపీఐ నుంచి పాల్గొనేందుకు అనుమతి ఉన్నా.. స్థానిక పోలీసులు, అధికార యంత్రాంగం అనుమతించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కె.విమల, కె.సత్యనారాయణ, రెహమాన్, ఎస్.మురళీ, ఎం.డి.బేగం, కె.వనజాక్షి, పి.పద్మ, అన్నపూర్ణ, జి.జయ, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో ప్లాస్టిక్ వ్యర్థాలు



బాలయ్యశాస్త్రి లేఅవుట్ రహదారిలో ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలు

సీతమ్మధార: జీవీఎంసీ చెత్త సేకరణ వాహనాల పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యంతో రోడ్లపై చెత్త చెల్లాచెదురుగా పడిపోతోంది. క్లాప్ వాహనానికి తగిలించిన బ్యాగులు తెగిపోయి రోడ్లపై ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలు జారిపడుతున్నాయి. వాహనాల చోదకులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. గురువారం మధ్యాహ్నం బాలయ్యశాస్త్రి లేఅవుట్ నుంచి నార్త్ ఎక్స్‌టెన్షన్ వైపు పారిశుధ్య సిబ్బంది తడి, పొడి చెత్తలను తొలగిస్తున్నారు. వాహనం వెనుక ఒక గోనె సంచిలో వాటర్, కూల్ డ్రింక్ బాటిళ్లతోపాటు ప్లాస్టిక్ వస్తువులను వేసి తగిలించడంతో ఒక్కసారిగా తెగిపడి వెనుక వస్తున్న వాహనాలపై పడిపోయాయి. ఆ సమయంలో వాహనాలు ఒకదాన్ని మరొకటి ఢీకొట్టడంతో వాహనదారుల మధ్య ఘర్షణకు దారి తీసింది. చెత్త తొలగింపులో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అధికారులు పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.

నేపాల్‌లో మానవ హక్కులపై 13న అభిప్రాయ సేకరణ

డాబాగార్డెన్స్: ఆసియా దేశాల్లో మానవ హక్కుల అమలు తీరుపై ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలి వచ్చే నెల 13న నేపాల్ దేశం ఖాట్మాండ్‌లో అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్టు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993 కంటితుడుపుగా ఉందని, ఈ చట్టంపై ప్రజాప్రతినిధులకు అవగాహన లేదన్నారు. బాలల హక్కులు, మానవ హక్కులు, మహిళల హక్కులకు ఏర్పాటు చేసిన కమిషన్‌లకు అధికారాలు కల్పించాలని, రాజకీయ పునరావాస కేంద్రాల స్థాయి నుంచి విముక్తి కల్పించాలని నివేదిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో నేపాల్‌లో జరిగే సదస్సులో భారత్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలలో మానవ హక్కుల ఉల్లంఘనలు, చట్టాలు అమలు, తదితర అంశాలు చర్చించనున్నారని కౌన్సిల్ సభ్యుడు ఎం.సూర్యశ్రీనివాస్ తెలిపారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, పీపుల్స్ వాచ్, కామన్ వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇన్సియేటివ్, తదితర మానవ హక్కుల స్వచ్ఛంద సంస్థలు భారత్ నుంచి ఆహ్వానం అందుకున్నాయన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు టీవీహెచ్ శ్రీరాములు, మార్టిస్ ఎర్రైనా, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గైస్ విద్యార్థినికి ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి



దాసరి వంశీప్రియాంక

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థిని దాసరి వంశీప్రియాంక ఉత్తమ ప్యాకేజీతో ఉపాధి పొందింది. రూ.6.73 లక్షల వార్షిక వేతనంతో ఏసియన్ పెయింట్స్ కంపెనీలో ఉద్యోగం సాధించింది. ఇంతవరకు డిప్లమా విద్యార్థులకు ఇంతటి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చిన దాఖలాలు లేవని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. వంశీప్రియాంక ఈ కాలేజీలో కెమికల్ ఇంజినీరింగు కోర్సులో 2018లో చేరి 2022 ఏప్రిల్‌లో పాస్‌అవుట్ అయింది. ఈమెకు అచ్యుతాపురంలోని ఏసియన్ పెయింట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ప్రిన్సిపాల్‌తో పాటు డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎం.విజయలక్ష్మి.. ప్రియాంకను అభినందించారు.

మాతా, శిశు మరణాల నియంత్రణకు చర్యలు



మాతా, శిశు మరణాలపై వైద్యులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతా, శిశు మరణాల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన గురువారం మాతా, శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 11 మంది శిశువులు చనిపోయారని, ఇక ముందు ఇటువంటి మరణాలు సంభవించకుండా చూడాలన్నారు. వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముత్యమాంబ కాలనీ, చేపలుప్పాడ, దండుబజార్, పాత రేసపువానిపాలెం, చంద్రనగర్, గంగవరం, భవానీ గార్డెన్స్, లంకెలపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన పెదగంట్యాడ, రేవిడి, ఆనందపురంల్లో ఒక్కొక్కరూ చనిపోయారని వెల్లడించారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, డాక్టర్ బి.ఉమావతి, ఇతర అధికారులు బి.జ్యోతి, డీపీహెచ్ఎన్‌వో మురళీకృష్ణ తదితరులు పాల్గన్నారు.

పునశ్చరణ తరగతులతో సమర్థవంతంగా విధులు



సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్

దొండపర్తి: ఆధునిక సమాజంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు పునశ్చరణ తరగతులు దోహదపడతాయని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఏఆర్ సిబ్బందికి మొబిలైజేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మొదటి విడతగా ఏఆర్ సిబ్బందికి 15 రోజుల పాటు పీటీ, డ్రిల్, యోగా, ఆయుధ తరగతులతో పాటు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. విధి నిర్వహణలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 సునీల్ సుమిత్ గరుడ్, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఎస్‌బీ ఏడీసీపీ డి.గంగాధర్, ఏఆర్ ఏడీసీపీ కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు (ఏఆర్) ఆర్‌పీఎల్ శాంతికుమార్, జి.రాఘవేంద్రరావు, ఆర్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ-రాయగడ సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



అధికారులతో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం – రాయగడ సెక్షన్ పరిధిలో గురువారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి విండో ట్రయలింగ్ తనిఖీలు నిర్వహించారు. ఆయా రైల్వే స్టేషన్లలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. రాయగడ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందితో డీఆర్‌ఎం మాట్లాడారు. ప్రయాణికులతో మాట్లాడి, వారి సమస్యలను, సూచనలను స్వీకరించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్(జి) మనబేష్ మిశ్రా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సిహెచ్.రఘువీర్, రైల్ వికాస్ నిగం లిమిటెడ్ ఏజీఎం శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత టైర్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

భారీగా ఎగసిపడ్డ మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గాజువాక : స్థానిక శ్రీనగర్‌లోని సివిల్ సప్‌లైస్ గోడన్ల సమీపంలో గల ఒక పాతటైర్ల దుకాణంలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వంట కోసం కర్రల పొయ్యి వెలిగించడానికి పెట్రోల్ పోయడంతో ఈ సంఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సతేందర్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి శ్రీనగర్‌లోని సివిల్ సప్‌లై గోడన్ల వద్ద పెట్రోల్ బంక్‌ను ఆనుకొని పాతటైర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇద్దరు సిబ్బందిని నియమించుకొని పాత టైర్లకు పంక్చర్లు వేయడంతోపాటు రీబటనింగ్ పనులను నిర్వహిస్తున్నాడు. అందులోనే వంట చేసుకోవడం కోసం గురువారం కట్టెల పొయ్యి వెలిగించారు. అది మండటం కోసం అందులో పెట్రోల్ పోయడంతో ఒక్కసారిగా మంట పైకి వచ్చి అక్కడి పాతటైరుకు అంటుకుంది. ఆ మంట క్షణాల్లో మొత్తం దుకాణమంతా విస్తరించింది. దీంతో దట్టమైన పొగతో కూడిన మంటలు ఎగసిపడ్డాయి. పొగలు ఆ ప్రాంతాన్ని కమ్మేశాయి. సంఘటన చోటుచేసుకున్న దుకాణానికి ఆనుకొని పెట్రోల్ బంక్ కూడా ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బంది రెండు శకటాలతో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రాథమిక విచారణ నిర్వహించారు.

ఒడిశా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో పదో తరగతి 1993-94 బ్యాచ్ విద్యార్థులు

ఆరిలోవ: ఒడిశా రాష్ట్రం రాయగడలో గోపబంధు మున్సిపల్ హైస్కూల్ 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం గురువారం నగరంలో ఓ హోటల్‌లో జరిగింది. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎవరు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలిసుకున్నారు. విశాఖ, తిరుపతి, రాయగడ, శ్రీకాకుళం ప్రాంతాలతో పాటు ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాలలో స్థిరపడినవారు ఈ ఆత్మీయ కలయికలో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.మాధవి, ఎస్.శ్రీను, కె.వి.శర్మ, తదితరులు పాల్గొన్నారు.